బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 23 అక్టోబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## పిడుగుపాటుకు తండ్రి, కుమార్తె మృతి

బలగం టీవి, హైదరాబాద్



పిడుగుపాటుకు గురై తండ్రి కూతురు మృతి చెందిన సంఘటన ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని అడవి మద్దులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అడవి మదనపల్లి గ్రామానికి చెందిన చింతల లింగస్వామి ఆయన భార్య, కుమార్తె పత్తి చేనులో మంగళవారం పత్తి తీస్తుండగా పిడుగు పడింది.. దీంతో తండ్రితో పాటు కుమార్తె అక్కడికక్కడే మృతి చెందింది. మృతుడి భార్యకు గాయాలు కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- 25న బదలాయింపుపై ఆయా సంస్థలతో సమావేశం
- భూ సమస్యలకు త్వరలో పరిష్కారం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


# ఎన్ఐసీకి ధరణి



బలగం టీవి, హైదరాబాద్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ నిర్వాహణ బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్‌కి అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ధరణి పోర్టల్ నిర్వాహణ బాధ్యతలను మూడేళ్ల పాటు ఎన్ఐసీకి అప్పగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో రేవంత్ రెడ్డి సర్కార్ పేర్కొంది. ఇప్పటి వరకు టెరాసిస్ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తున్న ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఎన్ఐసీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది.ఎన్ఐసీ పనితీరు బాగుంటే మరో రెండేళ్ళ నిర్వహణ బాధ్యతలను పొడిగించుకునే వెసులుబాటును కూడా కల్పిస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. టెరాసిస్ నుంచి ఎన్ఐసీకి అప్పగించడం ద్వారా దాదాపు కోటి రూపాయల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని రెవెన్యూ అధికారులు వెల్లడించారు. అయితే ధరణి పోర్టల్‌కు చెందిన సాంకేతిక అంశాలను ఎన్ఐసీకి నవంబరు 30వ తేదీ వరకు టెరాసిస్ సంస్థ సిబ్బంది పూర్తి స్థాయిలో బదలాయించనుందని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఇదిలా ఉంటే.. ధరణి పోర్టల్ స్థానంలో భూమాత పేరుతో పోర్టల్ ఏర్పాటుకు రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వ ఎన్ఐసీకి బదలాయింపు ప్రక్రియను ప్రభుత్వం ఇటీవే పూర్తిచేసింది. ఇక పేరు మార్పటమే తరువాయిగా తెలుస్తోంది. ధరణి పోర్టల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా.. దాదాపు పరిష్కరించినట్టు తెలుస్తోంది. కొత్త చట్టంతో ముడిపడి ఉన్న అంశాలకు సంబం ధించిన దరఖాస్తులే మిగిలిపోయినట్లు అధికారులు చెప్తున్నారు.



## ఉక్రెయిన్‌లో శాంతిని కోరుకుంటున్నాం

- ప్రధాని మోడీ
- రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మోడీ భేటీ

బలగం టీవి, హైదరాబాద్

బ్రిక్స్ సదస్సుకు విచ్చేసిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు. గత శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని మార్పులను నేటి ప్రపంచం చూస్తోందని, అంతర్జాతీయంగా పరిస్థితులు కల్లోలంగా వున్నాయని, ఒకదానితో ఒకటి ముడిపడి వున్నాయని జిన్‌పింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు వున్నాయని ప్రశంసించారు. ఇరు దేశాలు సమగ్ర వ్యూహాత్మక సమన్వయాన్ని, ఆచరణాత్మక సహకారాన్ని మరింత విస్తరించుకుంటూనే వున్నాయన్నారు. జిన్‌పింగ్‌ను తన ప్రియమిత్రుడుగా పుతిన్ అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరీకరణకు దోహదపడుతోందన్నారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా కూడా పుతిన్‌తో భేటీ అయ్యారు. రష్యాను విలువైన మిత్రపక్షంగా భావిస్తున్నామని చెప్పారు. వర్ణవివక్షతపై పోరాట కాలం నుండి నేటి వరకు ఇరు దేశాల మధ్య స్నేహ బంధం అలాగే కొనసాగుతోందన్నారు.

ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రిక్స్ దేశాలతో సన్నిహిత సహకారానికి భారత్ నిబద్ధతతో వుందని పేర్కొంది. వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం, సమర్ధవంతమైన రీతిలో సరఫరా గొలుసులను నిర్మించుకోవడం వంటి పలు కీలకమైన అంతర్జాతీయ అంశాలను పరిష్కరించడంలో బ్రిక్స్ పాత్రపై చర్చించనున్నారు. గతేడాది కొత్త సభ్యులను చేర్చుకోవడం వల్ల బ్రిక్స్ సమర్ధత మరింత పెరిగిందని పీఎంఓ పేర్కొంది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మోడీ ఈ పర్యటన ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. న్యాయమైన అంతర్జాతీయ అభివృద్ధి, భద్రతకు బహుళపక్షవాదాన్ని బలోపేతం చేయడం ఈ ఏడాది సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా వుందని విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.ఉక్రెయిన్‌లో శాంతిని కోరుకుంటున్నామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనడంలో సహాయం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉన్నదని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు స్పష్టంచేశారు. రష్యాలోని కజాన్‌లో జరుగుతున్న బ్రిక్స్ 16వ సదస్సుకు హాజరైన మోదీ మంగళవారం పుతిన్‌తో భేటీ అయ్యారు. రష్యా, ఉక్రెయిన్ మధ్య సాగుతున్న సాయుధ ఘర్షణను తాము నిత్యం గమనిస్తున్నామని, గతంలో చెప్పినట్టు సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నది భారత్ అభిమతమని చెప్పారు. ర ష్యా అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సులో సభ్య దేశాలు ఆర్థిక సహకారం, వాతావరణ మార్పులు అం శాలపై విస్తృతంగా చర్చించనున్నాయి. బ్రిక్స్ సదస్సుకు భారత్ చాలా ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. బ్రిక్స్ దేశాల అధినేతలతో విడివిడిగా ద్వైపాక్షిక సమావేశాలు జరిపే అవకాశం వుందని, పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరపడం కోసం ఎదురుచూస్తున్నానని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు రష్యాకు బయలుదేరడానికి ముందుగా మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పాయి



- ఇదే విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చెప్పారు.
- మాజీ మంత్రి కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పడంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో ఇకనైనా ప్రభుత్వ పెద్దలు వివేకంతో ఆలోచించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని సూచించారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని కొన్ని నెలల నుంచి జనం ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారని కేటీఆర్ తెలిపారు. ఇప్పుడు అదే విషయాన్ని స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా ఆవేదనతో చెబుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అదుపు తప్పిన లా అండ్ ఆర్డర్ పరిస్థితి చూస్తుంటే ఆందోళన కలుగుతోందని అన్నారు. రాష్ట్రానికి హోంమంత్రి లేకపోవటం, పోలీసులు రాజకీయ వ్యవహారాల్లో బిజీగా ఉండటంతోనే ఈ సమస్య తలెత్తిందని అభిప్రాయపడ్డారు.ఇకనైనా శాంతి భద్రతలు కాపాడే విషయంలో ప్రభుత్వ పెద్దలు వివేకంతో ఆలోచించాలని కేటీఆర్ కోరారు. పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని సూచించారు. రాష్ట్రంలో సమర్ధవంతమైన పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారని.. వారి పని వారిని చేసుకొనిస్తే శాంతి భద్రతలు, రాష్ట్రంలో సామరస్యాన్ని కాపాడగలుగుతారని అన్నారు.

గత పాలకులు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు.. ఆర్థిక నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని నిత్యం అసత్యాలు, అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్థిక నిర్వహణ ఎలా ఉందో చెప్పడానికి ఈ సాక్ష్యం సరిపోతోందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ రిపోర్టుతో కాంగ్రెస్, బీజేపీ అబద్ధాలు బట్టబయలు అయ్యాయని, ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందన్నారు.

2014-15 నుండి 2022-23 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాల ఆర్థిక నిర్వహణ సూచికలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉంది. ఈ సమయంలో ఆర్థిక నిర్వహణలో తెలంగాణ ఓ వెలుగు వెలిగిపోయింది. డెబ్ట్ మేనేజ్‌మెంట్ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ ఇండెక్స్‌లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. కేసీఆర్ ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం అసాధారణమైన ఆర్థిక వివేకం, క్రమశిక్షణను ప్రదర్శించిందని స్పష్టమవుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. దీంతో రాష్ట్రం దివాళా తీసిందంటూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న బూటకపు ప్రచారానికి తెరపడిందని.. కాంగ్రెస్ నాయకత్వమే ఇవాళ దివాళా తీసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలను సమర్ధవంతంగా నిర్వహించగల సామర్థ్యాన్ని ప్రదర్శిస్తూ, 10 సంవత్సరాల పాలనలో బీఆర్ఎస్ పార్టీ యొక్క సమర్ధవంతమైన పాలనకు ఈ విజయం నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం ఎదుట కిషన్ రెడ్డి ధర్నా చేయాలి



- మూసీకి పైసా తీసుకురాని కిషన్ రెడ్డి ఆత్మ పరిశీలన చేసుకోవాలి
- బండి పోతే బండి ఇస్తామన్నారు...ఆ తర్వాత ఏ సహాయం చేయలేదు
- బీజేపీ ఈ నెల 25 న తలపెట్టిన ధర్నాను విరమించుకోవాలి

బలగం టీవి, హైదరాబాద్

గత పదేండ్లలో మూసీ ప్రక్షాళన కోసం గానీ.. మూసీ ప్రాంత ప్రజల సంక్షేమం, ఉపాధి కోసం గానీ నయా పైసా కేటాయించని కేంద్ర ప్రభుత్వం ఎదుట.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి , రాష్ట్ర బీజేపీ నేతలు మొదట ధర్నాలు చేయాలని పంచాయతీ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేసారు. సొంత నియోజకవర్గం గుండా మూసీ పారుతున్నా ఏనాడు కేంద్రం నుంచి నిధులు తీసుకురాని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఇప్పుడు మూసీ ప్రాంత ప్రజల తరుపున ధర్నాకు పిలువునివ్వడం ఎందుకని ప్రశ్నించారు. మూసీ ప్రాంత ప్రజల పక్షాన ఈ నెల 25న ఇందిరా పార్క్ వద్ద బీజేపీ తలపెట్టిన ధర్నాను విరమించుకోవాలని సీతక్క సూచించారు. మూసీ పరివాహక ప్రాంతం లో ముగ్గురు బీజేపీ ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నందున..కేంద్రంతో చర్చించి హైదరాబాద్ జీవన రేఖగా భావించే మూసి పునరుజ్జీవనం కోసం రూ. పది వేల కోట్ల ను మంజూరు చేయించాలని డిమాండ్ చేసారు.

రెండేళ్ల క్రితం వరదల్లో మూసీ ప్రాంత ప్రజలు నష్టపోయినప్పుడు బండికి బండి ఇస్తామని, ప్రతి ఇంటికి నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ కేంద్ర ప్రభుత్వం ఒక్కరిని కూడా ఆదుకో లేదని మంత్రి సీతక్క గుర్తు చేసారు. ఇప్పుడు మూసీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ బీజేపీ తన నైజాన్ని బయటపెట్టుకుంటుందని ఆరోపించారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును సమర్థిస్తున్న బీజేపీ...ఇక్కడ మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తుందని సీతక్క ప్రశ్నించారు.

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు సక్సెస్ అయ్యి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగి ఎక్కడ ఇతర నగరాలను దాటిపోతుందో అనే భయం బీజేపీ నేతలను వేంటాడుతుందని...అందుకే మూసి యజ్ఞంను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. నిజంగా మూసీ ప్రాంత ప్రజల పట్ల ప్రేమ ఉంటే గత పదేండ్లలో ఎందుకు వారిని పట్టించుకోలేదని ప్రశ్నించారు. మూసీ డెవలప్మెంట్ ప్రాజెక్టులో ఎక్కడా బలవంతపు తరలింపులు లేవని, ప్రజల సమ్మతితోనే వారికి మరో చోట స్థిర నివాసం, ఉపాధి కల్పించిన తర్వాతే ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అయినా మూసీ పునరుజ్జీవన వంటి మంచి కార్యక్రమాన్ని అడ్డుకోవడం

మిగితా 3వ పేజీలో

## "ప్రజావాణి" కార్యక్రమం అద్భుతం

బలగం టీవి, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం అద్భుతంగా ఉందని, ప్రజలు ప్రజా భవన్ లో తమ సమస్యలు విన్నవించేందుకు భారీగా తరలి వస్తుండటం విశేషం అని ఇండియన్ ఆర్మీ, నేవీ, ఏయిర్ ఫోర్స్, ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బృందం అభిప్రాయపడింది. మంగళవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇంచార్జీ డాక్టర్ జీ చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవారాజన్ లతో ఈ బృందం అధికారులు సమావేశమయ్యారు.ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా చిన్నారెడ్డి, దివ్య ఆ బృందానికి వివరించారు. బృందంలోని కొంత మంది అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు చిన్నారెడ్డి, దివ్య సమాధానాలు ఇచ్చారు.

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అర్జీలు అందజేసిన వెంటనే సమస్యలు ఓపికతో విని సీఎం ప్రజావాణి పోర్టల్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు పంపుతామని, సీఎం ప్రజావాణి పేరిట అక్నాలెడ్జ్‌మెంట్ ఇస్తామని, ప్రజల సమస్య పరిష్కారం అయ్యే వరకు నిరంతరంగా ఫాలో అప్ ఉంటుందని చిన్నారెడ్డి, దివ్య తెలిపారు.

మిగితా 3వ పేజీలో

## విద్యార్థులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేస్తాం

బలగం టీవి, హైదరాబాద్



రాష్ట్రంలో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల రద్దీ ఎక్కువగా ఉంటుందని.. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు బస్సులను అందుబాటులో ఉంచుతున్నారని తెలిపారు. అయినా కొన్ని రూట్లలో విద్యార్థుల రద్దీ వీపరీతంగా ఉంటున్న విషయం సంస్థ దృష్టికి వచ్చిందని తెలిపారు. కాగా, టీజీఎస్ఆర్టీసీకి చెందిన ఒక బస్సులో కొందరు విద్యార్థులు ఫుట్ బోర్డు ప్రయాణం చేస్తోన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యియి.. దీనిపై ఎండీ సజ్జనార్ స్పందిస్తూ ఈ విషయం ఆర్టీసీ యాజమాన్యందృష్టికి వచ్చిందని తెలిపారు.రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో బస్సుల సంఖ్యను పెంచాలని యాజమాన్యం ఇప్పటికే నిర్ణయించిందని.. ఆ దిశగా చర్యలు కూడా తీసుకోవడం జరుగుతోందని తెలిపారు. విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం కట్టుబడి ఉందని వెల్లడించారు.

ప్రతి రోజు లక్షలాది మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లోనే తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. విద్యార్థులకు రవాణా పరంగా ఇబ్బందుల్లేకుండా తగినన్ని బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతోంది. కావున, తమ వ్యక్తిగత భద్రతను దృష్టిలో పెట్టుకుని ఫుట్ బోర్డు ప్రయాణం చేయకుండా సహకరించాలని విద్యార్థులను యాజమాన్యం కోరుతోంది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సంఖ్యలో బస్సుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ వ్యక్తిగత భద్రతను దృష్టిలో ఉంచుకుని ఫుట్‌బోర్డ్ ప్రయాణం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



## జీవన్ రెడ్డి ఆవేదనతో మాట్లాడారు : మహేశ్ కుమార్ గౌడ్

బలగం టీవి, హైదరాబాద్

తన అనుచరుడు హత్యకు గురికావడంతో పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి తీవ్ర మనస్తాపానికి లోనై పార్టీ గురించి అలా మాట్లాడారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తన అనుచరుడు గంగారెడ్డి హత్యకు గురి కావడంతో జీవన్ రెడ్డి సొంత పార్టీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇక పార్టీలో ఉండలేనని వ్యాఖ్యానించారు. మీడియాతో మాట్లాడుతుండగా మహేశ్ కుమార్ గౌడ్ ఫోన్ చేయగా... ఆ కాల్ ను జీవన్ రెడ్డి మధ్యలోనే కట్ చేశారు.జీవన్ రెడ్డి అసంతృప్తిపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. ఆయన బాధలో ఉండి ఆవేదన వ్యక్తం చేశారన్నారు. జీవన్ రెడ్డితో తాను ఫోన్లో మాట్లాడానని, ఆ తర్వాత పోలీసులతోనూ మాట్లాడానన్నారు. హత్యకు సంబంధించి సమాచారం తీసుకున్నట్లు తెలిపారు. హంతకుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడని, విచారణ జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని మంత్రి శ్రీధర్ బాబుకు అప్పగించామన్నారు.

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడి హత్య

- రోడ్డుపై బైటాయించి ఎమ్మెల్సీ నిరసన
- మీకు.. మీ కాంగ్రెస్ పార్టీకో దండం.. ఇకనైనా మమ్మల్ని బతకనియ్యండి : ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి



బలగం టీవి, జగిత్యాల

జగిత్యాల జిల్లాలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి(58) దారుణ హత్యకు గురయ్యాడు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి.. మంగళవారం ఉదయం గ్రామంలో బైక్‌పై వెళుతుండగా.. గుర్తుతెలియని దుండగులు మొదట కారుతో వెనుక నుంచి ఢీ కొట్టి కింద పడగానే కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని.. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెంటనే జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి చేరుకొని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. హత్యకు పాల్పడిన నిందితుల్ని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న గంగారెడ్డిని హత్య చేయడమంటే.. తనను హత్య చేసిన దాంతో సమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు రక్షణ లేకపోతే ఇక పార్టీని, కార్యకర్తలను ఏ విధంగా కాపాడుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీకు.. మీ కాంగ్రెస్ పార్టీకో దండం.. ఇకనైనా మమ్మల్ని బతకనియ్యండి' అంటూ సొంత పార్టీపై ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఇంత కాలం మానసిక అవమానాలకు గురవుతున్నా తట్టుకున్నామని, ఇప్పుడు భౌతికంగా దాడులు చేసి చంపుతున్నారని, ఎందుకు భరించాలని, ఓ స్వచ్ఛంద సంస్థ పెట్టుకొనైనా ప్రజలకు సేవ చేస్తానంటూ ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌తో జీవన్ రెడ్డి తన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగాలంటూ తనకు ఫోన్ చేసిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'పార్టీలో ఎందుకు కొనసాగాలి.. దయచేసి తనను క్షమించాలి. తాను పార్టీలో ఉండలేను' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. నాలుగు దశాబ్దాల కష్టానికి మంచి బహుమతి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ వైపు మహేష్ గౌడ్ మాట్లాడుతుండగానే ఫోన్ కట్ చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జిల్లా ఎస్పీతో మాట్లాడి నిందితులను త్వరగా పట్టు కోవాలని కఠినంగా శిక్షించాలని కోరారు. కాగా, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున రోడ్డుపై నిరసన చేపట్టడంతో పట్టణంలో భారీగా ట్రాఫిక్ జామైంది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు గుండా మళ్ళించారు. ఎలాంటి అవాంఛ నీయ ఘటనలు జరగకుండా గ్రామంతో పాటు జగిత్యాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నిర్దేశిత సమయంలోగా ఎల్ఆర్ఎస్ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలి..



- ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటిని సకాలంలో చేయాలి...
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటిని సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుల పురోగతి పై కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు.

జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణ ప్రాంతాలు, ఇతర గ్రామీణ ప్రాంతాలలో వచ్చిన మొత్తం 42,942 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, వివరాలను మండలాల వారీగా కలెక్టర్ తెలుసుకుంటూ పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యల పై పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్ర్కూటిని ప్రక్రియ 4 దశలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు . ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సర్వే నెంబర్ వారీగా సంబంధిత రెవెన్యూ గ్రామం/మున్సిపాలిటీ లలో బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేసి జిపిఎస్ ద్వారా సదరు భూమి కో ఆర్డినేట్స్ పక్కాగా నమోదు చేస్తూ అదే సమయంలో ఈ భూములు నీటి వనరుల బఫర్ జోన్ ,నాలా,చెరువులు ,హెరిటేజ్ బిల్డింగ్ ,డిఫెన్స్ ల్యాండ్ పరిధిలో వస్తుందో లేదో చెక్ చేసి ధ్రువీకరించాలని అన్నారు. జిల్లాలో పెండింగ్ ఉన్న ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ లెవల్ సర్వే ధృవీకరణ ప్రక్రియ దరఖాస్తులు యాక్సెప్ట్ లేదా రిజెక్ట్ పక్కాగా జరగాలని అన్నారు.మొదటి దశలో ధ్రువీకరణ పూర్తి చేసుకున్న దరఖాస్తులను నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు ఓపెన్ స్పేస్ మొదలగు నిబంధనలు లేఔట్ లో పాటించారా అనే అంశాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదించాలని, ఎల్ఆర్ఎస్ క్రింద భూముల క్రమబద్ధీకరణకు జనరేట్ ఐన ఫీజు వివరాలు దరఖాస్తుదారులకు తెలియజేసి త్వరగా చెల్లించేలా ఫాలో అప్ చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి మండలం పరిధిలో పెండింగ్ ఉన్న దరఖాస్తులను అధికారులు నిర్దేశిత సమయంలోగా ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఇన్చార్జి డీపీఓ శేషాద్రి,ఇరిగేషన్ ఈఈ అమరేందర్ రెడ్డి , సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలి బేగ్, సంపత్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు ,ఎం.పి.ఓ.లు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ సస్పెండ్

- ఉత్తర్వులు జారీ చేసిన డీఈఓ రమేష్ కుమార్

**బలగం టీవీ , సిరిసిల్ల :**

స్కూల్లో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ ను సస్పెండ్ చేస్తూ డీఈఓ రమేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పలువురు విద్యార్థినులతో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడు నరేందర్ అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు వచ్చాయి. దీని పై విచారణ చేయాలని పలువురు ఉపాధ్యాయులతో డీ ఈఓ రమేష్ కుమార్ కమిటీని వేశారు. వారి స్కూల్లో విచారణ చేపట్టగా, స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడు నరేందర్ పలువురు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని తేలింది. దీంతో సదరు ఉపాధ్యాయుడిని డీఈఓ రమేష్ కుమార్ సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జిల్లాను వదిలి వెళ్ళవద్దని స్పష్టం చేశారు.

# విద్యాసంస్థల హాస్టళ్లలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేయాలి..



- డీఈఓపై విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలి..

**బలగం టీవీ , సిరిసిల్ల:**

అన్ని విద్యాసంస్థలు హాస్టల్లో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చేసి, నిఘ పెట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు.మంగళవారం పాఠశాల కళాశాల గురుకుల హాస్టల్స్ లల్లో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చెయ్యాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టర్ సందీప్ కుమార్,ఎస్పీ అఖిల్ మహాజన్ లకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భం గా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మాట్లాడుతు రాజన్న సిరిసిల్ల జిల్లాలో తరచు అనేక సంఘటనల వల్ల విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారని,వేధింపుల పైన కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ఇది ముమ్మాటికీ డీఈఓ నిర్లక్ష్యమే అని, డీఈఓ తన కార్యాలయం నుండి కదలడం లేదు,ఎలాంటి తనిఖీ లు చేపట్టడం లేదు,గతంలో విద్యార్థుల సమస్యలపైన అనేకసార్లు ఫిర్యాదు చేసినా డి ఈ ఓ పట్టించుకోలేదని,పలు ప్రైవేట్ స్కూళ్ల నుండి డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు.డీఈఓ పై సరైన విచారణ దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోని సస్పెండ్ చెయ్యాలని డిమాండ్ చేశారు .విద్యార్థినిలకు రక్షణ కల్పించాలని, అలాగే జిల్లాలో ప్రభుత్వ పాఠశాల లో కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు అని అన్నారు.విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా టీచర్స్ లేక చదువుకు దూరం అవుతున్నారు అని,టీచర్ ల కొరత తీర్చాలనిడిమాండ్ చేశారు. గర్ల్స్ గురుకుల హాస్టల్స్ లో కూడా నిఘా పెట్టాలని వారికీ నాణ్యమైన ఆహారం అందడం లేదు అని,వారికీ నాణ్యమైన ఆహారం అందించాలని అన్నారు.విద్యార్థినిలా రక్షణ ప్రతి స్కూల్ హాస్టల్స్ గురుకులల్లో కళాశాల లో ఫిర్యాదు బాక్స్ లను ఏర్పాటు చేయాలనీ,ప్రతి నెల పాఠశాలలతో పాటు గురుకులాల్లో తనిఖీ లు చేయాలనీ అన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజు రావు, లా ఫోరమ్ విభాగ్ కన్వీనర్ సమానపల్లి ప్రశాంత్, టౌన్ సెక్రటరీ ఎలాగందుల శ్రీనివాస్,పూజం కార్తీక్, నవీన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు




# కీచక టీచర్ పై చర్యలు తీసుకోవాలి

- భవిష్యత్ లో ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి..
- ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గీతనగర్ పాఠశాల ముందు ధర్నా...**

**బలగం టీవీ , సిరిసిల్ల**

విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక టీచర్ పై ఫోక్సో కేసులు నమోదు చేసి, సస్పెండ్ చెయ్యాలని ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు.మంగళవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతా నగర్ హై స్కూల్లో నరేందర్ అని కీచక ఉపాధ్యాయుడు విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని వెంటనే అతనిపై పోక్సో కేసు నమోదు చేసి ,సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ముందు ధర్నా నిర్వహించి,అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలిసి కీచక టీచర్ పై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ గౌరవప్రదమైనటువంటి ఉపాధ్యాయ వృత్తిలో ఉంది సమాజానికి మంచి చెడులు నేర్పించాల్సినటువంటి గురువే విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేయడం ఉపాధ్యాయ వృత్తికే చెడ్డ పేరు తీసుకు వస్తున్నారని అన్నారు. ఇలాంటి కీచక ఉపాధ్యాయునిపై ఫోక్సో కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇట్టి విషయాన్ని 15 రోజుల క్రితమే ప్రధానోపాధ్యాయురాలు కి విద్యార్థులు చెప్పిన విషయం బయటకు రాకుండా చేసి విద్యార్థినిలను భయభ్రాంతులకు గురిచేసిన ప్రధానోపాధ్యాయురాలిపై శాఖా పరమైన చర్యలు తీసుకొని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో తరచు ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని బయటకు వచ్చేటివి కొన్నైతే బయటకు రానివి చాలా సంఘటనలు జిల్లాలో ఉన్నాయని వెంటనే జిల్లా విద్యాశాఖ అధికారులు, షీ టీం పోలీసు అధికారులు, ప్రతి పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి అవగాహన కార్యక్రమాలు చేయాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తికి చెడ్డ పేరు తీసుకొస్తున్న ఉపాధ్యాయులపై నిఘా పెట్టాలని అన్నారుఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేష్, నాయకులు సాయి భరత్, శివ, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి..



- ఎస్పీ అఖిల్ మహాజన్.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల**

నిరుద్యోగ యువత ఉపాధి,ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకొని, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో సీసీటీవీ ఇన్స్టాలైజేషన్ , సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ పై రెండు నెలల పాటు ఇవ్వనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ యువత ఉద్యోగ




అవకాశాలని అందిపుచుకోవాలని,కష్టపడి పనిచేయాల నుకునే యువత కోసం ఉద్యోగ అవకాశాలు క్యూ కడుతాయని అన్నారు.యువత ఖాళీగా ఉండకుండా తన విద్యార్హతకు తగిన ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా, వచ్చిన ఉద్యోగంలో ప్రతిభ కనబర్చడం ద్వారా యువత అనుకున్న లక్ష్యాలను సాధించడం సులవుతుందని, వచ్చిన అవకాశాలను అందిబుచ్చుకోని ముందుకు సాగిపోవాలని పిలుపునిచ్చారు.

జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్ జి ఓ సంస్థ సహకారంతో రెండు నెలల ఉచిత వసతి భోజనం సదుపాయంతో సీసీటీవీ ఇన్స్టాలైజేషన్ , సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్ పై ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్న 25 మందికి రోజు శిక్షణ ప్రారంభించడం జరిగిందని అన్నారు.రెండు నెలల పాటు ఇవ్వనున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని శిక్షణ అనంతరం హైదరా బాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాలలో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటుగా స్వతహాగా పెట్టుకు నేవారికి రుణాల కోసం సంబంధిత బ్యాంకుల సహాయంతో అనుసంధానం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో చందుర్తి సిఐ వెంకటేశ్వర్లు, సిరిసిల్ల రూరల్ సిఐ మొగిలి, ఎన్ జి ఓ సంస్థ అధికారులు పాల్గొన్నారు..

# ప్రారంభానికి పీహెచ్సీ సిద్ధం చేయాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,చందుర్తి**

చందుర్తి మండల కేంద్రంలో పీ హెచ్ సీ నూతన భవన తుది దశ పనులు పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. చందుర్తిలో రూ. 1 కోటి 56 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులను రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భవనంలోని అన్ని గదులు, ఆవరణను పరిశీలించారు. దవాఖాన ఆవరణను మొత్తం శుభ్రం చేయించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భవనంలో తుది దశ పనులను త్వరగా పూర్తి చేసి, ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. పాత భవనం నుంచి నూతన భవనంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని వైద్యాధికారి సంపత్ కు సూచించారు.

**విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించాలి.**

విద్యార్థుల పై ప్రత్యేక దృష్టి సారించాలని టీచర్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రుద్రంగిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. వారిని వివిధ సబ్జెక్టుల్లో ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. అనంతరం కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. ఈరోజు మెనూ ప్రకారం ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో తనిఖీ చేశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారు అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యాలయానికి ప్రహరీ నిర్మించాలని కలెక్టర్ కు విద్యాలయం బాధ్యులు విన్నవించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీఈఓ రమేష్ కుమార్, టీచర్ వనిత తదితరులు పాల్గొన్నారు.



# ప్రజావాణికి 518 దరఖాస్తులు

**బలగం టీవీ ,హైదరాబాద్**

**మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 518 దరఖాస్తులు అందాయి. మైనారిటీ వెల్ఫేర్ శాఖకు సంబంధించి 130, విద్యుత్ శాఖ కు సంబంధించి 82, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 72, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంబంధించి 55, సాంఘిక సంక్షేమం శాఖకు సంబంధించి 29, ప్రవాసీ ప్రజావాణి ద్వారా 1, ఇతర శాఖలకు సంబంధించి 150 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి, ప్రజాపాలన ప్రత్యేక అధికారి దివ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్ని దరఖాస్తులు స్వీకరించారు. ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.**

# నేడు, రేపు నీటి సరఫరా బంద్

**బలగం టీవీ ,హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు సరఫరా చేసే కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లయి ఫేస్-3లోని 2375 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు లీకేజీ ఏర్పడింది. దీనిని అరికట్టడానికి మరమ్మతు పనులు చేయనున్నారు. వీటిని ఈ నెల 24వ తేదీ (గురువారం) ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు 25వ తేదీ శుక్రవారం సాయంత్రం ఆరు గంటల వరకు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు పలు రిజర్వాయర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో ఆటంకం ఏర్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

**అంతరాయం ఏర్పడే ప్రాంతాలు**

శాస్త్రిపురం, బండ్లగూడ, భోజగుట్ట, షేక్‌పేట, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, ప్రశాసన్‌నగర్, తట్టిఖానా, లాలాపేట్, సాహెబ్‌నగర్, ఆటోనగర్, సరూర్‌నగర్, వాసవీ రిజర్వాయర్లు, సైనిక్‌పురి, మౌలాలి, గచ్చిబౌలి, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కావూరి హిల్స్, స్నేహపురి, కైలాసగిరి, దేవేంద్రనగర్, మధుబన్, దుర్గానగర్, బుద్వేల్, సులేమాన్ నగర్, గోల్డెన్ హైట్స్, 9 నంబర్, కిస్మత్‌పూర్, పెద్ద అంబర్‌పేట తదితర ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

# ఘనంగా కొమరం భీమ్ జయంతి వేడుకలు..




**బలగం టీవీ , సిరిసిల్ల :**




ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీక, గోండు విప్లవ వీరుడు కొమురం భీమ్ జయంతి వేడుకలను సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీ ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడుతూ అడవి బిడ్డల ఘీంకార స్వరం ఆయన అని,ఆదివాసుల స్వయం ప్రతిపత్తే ధ్యేయంగా ఎగిసిన ఉద్యమబావుట.. దేశానికి స్వాతంత్రం రాకముందే 'జల్ జంగల్ జమీన్' నినాదంతో పోరు తలపెట్టిన పోరాట యోధుడు కుమ్రం భీం అనిఅన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి , బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుడూరి ప్రవీణ్ , సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి , జడ్పీ మాజీ చైర్పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి,కౌన్సిలర్ సభ్యులు అన్నారం శ్రీనివాస్ , బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గజ బింకర్ రాజన్న , కుంభాల మల్లారెడ్డి, కోడి అంతయ్య , విజయేందర్ రెడ్డి, కంచర్ల రవి గౌడ్ గుగ్గిళ్ళ అజయ్ గౌడ్ పాల్గొన్నారు.

## రూ.49కోట్ల అంచనాతో

# అసెంబ్లీ పునరుద్ధరణ పనులు

- **మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

**బలగం టీవి, హైదరాబాద్**



ప్రస్తుతం ఉన్న అసెంబ్లీని 'రూ.49కోట్ల అంచనాతో అఘాఖాన్ ట్రస్ట్ ఆధునికీకరిస్తోందని మంత్రి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ లో ఆయన నేడు మీడియాతో మాట్లాడారు. ఈ పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు . నిజాం తరహాలో ఎలా కట్టారో అలా మార్పులు చేస్తున్నారన్నారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో అసెంబ్లీ,కౌన్సిల్ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పుడు అసెంబ్లీ నుంచి కౌన్సిల్ కు వెళ్లాలంటే వెహికిల్‌లో సీఎం మంత్రులు వెళ్లాల్సి వస్తుందని, రెండూ ఒకే దగ్గర ఉంటే సమయం ఆదా అవుతుందని తెలిపారు.

విద్యుత్ ఛార్జీల అంశంపై ఈఆర్సీ వద్దకు కేటీఆర్ వెళ్ళడం ఒక పెద్ద జోక్ అని, ఆయన ఒక జోకర్ అని మంత్రి వాఖ్యానించారు. లోక్ సభ ఎన్నికలలో ఒక్క సీటు రాకున్నా,అసెంబ్లీలో ఓడించినా కేటీఆర్‌కు బుద్ధి రాలేదన్నారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంటును పేదవాళ్ళకు తమ ప్రభుత్వం ఇస్తోన్నదని గుర్తు చేశారు. కేంద్ర మంత్రులు సంజయ్,కిషన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కి ఎంత నిధులు తెచ్చారు'అని కోమటిరెడ్డి ప్రశ్నించారు.

# క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదు

- **తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్**



**బలగం టీవి, హైదరాబాద్**

సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తన వ్యాఖ్యలపె క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్పష్టం చేశారు. సోమవారం ఓ ఆదర్శ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 'తమిళనాడులోనే గాక భారతదేశంలో అనేక చోట్ల నాపై కోర్టుల్లో కేసులు ఉన్నాయి. ఈ కేసులన్నీ వక్రీకరణల ఆధారంగా పెట్టారు. నేను కలైంజ్ఞర్ దివంగత సీఎం కరుణానిధి మనవడ్ని. ఈ అంశంలో క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదు' అని అన్నారు. తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దాలని చూస్తున్నారని, నవ వధూవరులు తమకు పుట్టబోయే పిల్లలకు అందమైన తమిళ పేర్లే ఎంచుకోవాలని కోరారు.

# మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్ మరో సియోల్ అవుతుంది



- **ఎంపీ చామల కిరణ్**

**బలగం టీవి, హైదరాబాద్**

పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చే అద్భుత సాంకేతిక పరిజ్ఞానం సియోల్ లో వినియోగంలో ఉందని, ఈ టెక్నాలజీతో మూసి నదికి పునర్జీవం పోస్తే హైదరాబాద్ కూడా సియోల్ నగరంగా మారనుందని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. దక్షిణకొరియా రాజధాని సియోల్ లో నాలుగు రోజుల పర్యటన నేపథ్యంలో నేడు రెండో రోజులో భాగంగా మాట్లాడారు. సీయోల్ నగరం నడిబొడ్డు నుండి ప్రవహించే చెంగిచియాన్ నది.. హైదరాబాద్ మధ్యలో ప్రవహించే మూసి లాగా మురికిమయంగా ఉండేదని చెప్పారు. అయితే ఈ నదిని సియోల్ నగర పాలక సంస్థ ప్రక్షాళనతో అత్యంత సుందర నగరంగా మారిందని చెప్పారు. కాగా, నదులు వాటి ప్రక్షాళన, అనంతరం చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే వనరుల పునర్వినియోగంపై రివర్స్ ఫ్రంట్ అధికారులతో చర్చించారు.

మూసినది ప్రక్షాళనతో హైదరాబాద్ నగరం కూడా మరో సియోల్ గా మారనుందని అన్నారు. చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే పునర్వినియోగం ప్లాంట్లను తెలంగాణా ప్రభుత్వం నెలకొల్పుతుందని వివరించారు. మూసీ నది ప్రక్షాళన తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని అన్నారు.

# ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్

**బలగం టీవి, హైదరాబాద్**



లంచం తీసుకుంటూ వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డా డు. ఏసీబీ మహబూబ్‌నగర్ రేంజ్ ఇన్‌చార్జి డీఎస్పీ శ్రీకృష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది పెబ్బేరులోని పలు వార్డుల్లో తాను చేసిన సీసీ రోడ్లు, పెయింటింగ్ పనులకు బిల్లులు చేయాలని కాంట్రాక్టర్.. మున్సిపల్ కమిషనర్ ఆదిశేషును కలిసి విజ్ఞప్తి చేశారు. ఒక్కో పనికి రూ.83,930 చొప్పున మూడు పనులకుగాను బిల్లులు ఇవ్వాలని కోరగా.. రూ.25 వేల లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేయగా రూ.20 వేలకు ఒప్పం దం కుదిరింది. మంగళవారం ఆదిశేషు సదరు కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ దాడులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, కేసు నమోదు చేశారు. ఇదే సమయం లో హైదరాబాద్‌లోని కమిషనర్ ఇంట్లోనూ ఏసీబీ అధికారులు సోదాలు చేశారు.

# కేంద్ర ప్రభుత్వం ఎదుట కిషన్ రెడ్డి ధర్నా చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకని ప్రశ్నించారు.

గత పదేండ్లలో మూసీ కోసం ఒక్క పైసా కేటాయించలేదని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి పార్లమెంటులోనే ప్రకటించినప్పుడు బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారు? యూపీఏ హాయంలో మూసీ ప్రక్షాళన కోసం 335 కోట్లు మంజూరు అయితే మోడి పాలనలో పైసా మంజూరు కాకపోయినా ఎందుకు మీరు పెదవి విప్పలేదు? అని సీతక్క ప్రశ్నించారు. ప్రధాని మోడిగారు ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసి లోని గంగా ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసిందని... ఇతర నదుల ప్రక్షాళన కోసం 6 వేల కోట్ల మంజూరు చేసిందని గుర్తు చేసారు. కాని మూసీ ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం పైసా కేటాయించకపోవడం తెలంగాణపై కేంద్రం వివక్షతకు నిదర్శనం కాదా? ఆ వివక్షతను మీరెందుకు ప్రశ్నించలేదు? అని సీతక్క ఆగ్రహం వ్యక్తం చేసారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నాలు మానుకుని...సొంత నియోజకవర్గం గుండా పారుతున్న మూసీ అభివృద్ధి కోసం పైసా తీసుకురాని కిషన్ రెడ్డి గారు ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిదని మంత్రి సీతక్క కోరారు.

# "ప్రజావాణి" కార్యక్రమం అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

మరో వైపు అర్జీలు స్వీకరించి వాటిపై ఎండార్స్ మెంట్ చేసి, సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి, దివ్య ఆ బృందానికి వివరించారు.ప్రజావాణి కార్యక్రమం ప్రాంతాన్ని ఈ బృందం సందర్శించింది. ప్రజావాణి కార్యక్రమం జరుగుతున్న తీరు తెన్నులను పరిశీలించిన ఈ బృందం... ప్రజావాణి కార్యక్రమం అధ్భుతం అని కొనియాడింది. ఈ కార్యక్రమంలో ఎం సీ ఆర్ హెచ్ ఆర్ డీ అధికారి మాధవీ రావులపాటి కూడా పాల్గొన్నారు.

# జెఎల్ ఫలితాలు విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

జూనియర్ లెక్చరర్ పోస్టులకు ఎంపిక అభ్యర్థుల జాబితాను టిజిపిఎస్సి ప్రకటించింది. ఇంటర్ విద్యాశాఖలో కెమిస్ట్రీ, సివిక్స్, ఉర్దూ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యద ర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఇతర వివరాలకు టిజి పిఎస్సి వెబ్‌సైట్ చూడాలని పేర్కొన్నారు.




# ఏపీలో అతిపెద్ద డ్రోన్ సమ్మిట్

**బలగం టీవి, హైదరాబాద్**

దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సమ్మిట్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభమైంది. మంగళగిరిలో అమరావతి డ్రోన్ సమ్మిట్ 2024ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ యుడుతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. కేంద్ర పౌర విమానయాన శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఏపీ డ్రోన్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళగిరి సీకె కన్వెన్షన్‌లో డ్రోన్ సమ్మిట్ నిర్వహించారు. డ్రోన్ సమ్మిట్‌లో 6929 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. 53 స్టాల్స్‌లో డ్రోన్‌ల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీలో భారత్ దూసుకుపోతోందన్నారు. అమెరికాలో ఉన్న కార్పొరేట్ సంస్థలను కలిశానని, ఇండియా టెక్నాలజీలో స్ట్రాంగ్ గా ఉందని, ఇండియాలో మాత్రమే అత్యధికంగా ఇంగ్లీష్ మాట్లాడే వారున్నాన్నారు. జీరో కనుగొన్నది ఇండియన్స్, ఇంగ్లీషు మాట్లాడే అధికులు ఇండియన్స్ అని బిల్ గేట్స్ కు చెప్పి ఒప్పించి మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు తెచ్చానని గుర్తుచేసుకున్నారు. ఇలాంటి ఒక డ్రోన్ సమ్మిట్ చాలా మంచిది. ఇది ఒక మార్పు తీసుకువస్తుందన్నారు. మనకు అడ్వాన్స్‌డ్ డ్రోన్స్, సీసీ కెమెరాలు, ఇతర ఐఓటీ పరికరాలు ఉన్నాయన్నారు. జాబ్ అడిగే వారు కావద్దు..జాబ్స్ ఇచ్చే వారిగా మారాలని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. తెలుగు కమ్యూనిటీ నుంచే 30 శాతం మంది జాబ్స్ ఇచ్చే వారుగా ఉన్నారన్న ఆయన ఎమిరేట్స్ నుంచి మొదటి ఫ్లైట్ హైదరాబాద్‌కు తెచ్చామని, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు కోసం అప్పటి ప్రధాని వాజ్ పేయిని ఒప్పించానని అన్నారు. ఇప్పుడు యుద్ధాల్లో కూడా వాడే డ్రోన్లను అభివృద్ధి కోసం వినియోగించాలనుకుంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. నాలెడ్జ్ ఎకానమీని అభివృద్ధి చేయటమే ఆంధ్రప్రదేశ్ ముఖ్య లక్ష్యమని వెల్లడించారు. 20వేల మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇవ్వాలన్నది లక్ష్యమని వివరించారు. అమరావతిని దేశానికి డ్రోన్ నగరంగానూ, ఆంధ్రప్రదేశ్‌ను డ్రోన్ హబ్‌గా తీర్చి దిద్దుతామని స్పష్టం చేశారు. అందరి ఆలోచనలతో 15 రోజుల్లో డ్రోన్ పాలసీ ప్రకటిస్తామన్నారు. కర్నూల్ సమీపంలోని ఓర్వకల్లు వద్ద 300 ఎకరాల భూమిని డ్రోన్ హబ్ కోసం కేటాయిస్తున్నామని తెలిపారు. నూతన ఆవిష్కరణలకు ఇది కేంద్రం కావాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు.

కాగా అమరావతి డ్రోన్ సమ్మిట్‌లో ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రెండు ఒప్పందాలు కుదుర్చుకుంది. డ్రోన్ పైలట్ శిక్షణపై క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వం మొదటి ఒప్పందం చేసుకుంది. తిరుపతి ఐఐటీని నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా చేర్చుకుంటూ రెండో ఒప్పందం కుదుర్చుకుంది. డ్రోన్ మార్కెట్ విస్తరణకు తానే బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికే డ్రోన్ హబ్ గా మారాలని ఆకాంక్షిస్తున్నా అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. డ్రోన్ల సమర్థ వినియోగం ద్వారా అత్యవసర సేవలు అందించటం సరికొత్త విప్లవమని తెలిపారు. గత 10ఏళ్లలో కేంద్ర పౌర విమానయాన రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. 74 విమానాశ్రయాలను 157కి గత పదేళ్లలో పెంచామని తెలిపారు.




# రామ్‌చరణ్‌కు అరుదైన గౌరవం..

**బలగం టీవీ, హైదరాబాద్**

గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ అరుదైన గౌరవం దక్కించుకున్నారు. ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్‌లో ఆయన మైనపు విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. సింగపూర్‌లోని మ్యూజియంలో చరణ్‌తోపాటు ఆయన పెంపుడు శునకం రైమీ విగ్రహాన్ని కూడా పెట్టనున్నారు. దీనికి సంబంధించిన ఫొటోషూట్, కొలతలు తీసుకోవడం ఇప్పటికే పూర్తయింది.రామ్ చరణ్ విగ్రహాన్ని సింగపూర్‌లోని తమ మ్యూజియంలో వచ్చే ఏడాది వేసవిలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని టుస్సాడ్స్ టీమ్ అబుదబి వేదికగా జరిగిన 'ఐఫా' వేడుకలో వెల్లడించారు. తాజాగా దీనికి సంబంధించిన వీడియోలు, ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

"టుస్సాడ్స్ కుటుంబంలో భాగం కావడం గౌరవంగా భావిస్తున్నా. చిన్నప్పుడు, దిగ్గజ నటులు పొందిన గుర్తింపు, మేడమ్ టుస్సాడ్స్‌లో వారి విగ్రహాలు చూసి ఆశ్చర్యపోయేవాడిని. నేను కూడా అలాంటి వారి పక్కన స్థానం సంపాది స్తానని ఊహించలేదు. ఈ గుర్తింపు నా క్రాఫ్ట్ పట్ల నాకు ఉన్న కృషి మరియు అభిరుచికి నిదర్శనం. ఇందుకు నేను చాలా కృతజ్ఞుడిపై ఉంటాను. మేడమ్ టుస్సాడ్స్ నుంచి నాకు దక్కిన అద్భుత అవకాశమిది" అన్నారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో ఇప్పటికే బాలీవుడ్‌తో పాటు టాలీవుడ్ సెలబ్రెటీల మైనపు విగ్రహాలు కూడా కొలువు దీరాయి. ప్రభాస్, అల్లు అర్జున్, మహేశ్ బాబు, కాజల్ ఇలా పలువురు సెలబ్రెటీల మైనపు విగ్రహాలు కొలువుదీరాయి. అయినప్పటికీ రామ్‌చరణ్ మైనపు విగ్రహం వాటన్నింటి కంటే కూడా చాలా స్పెషల్ అనే చెప్పాలి. ఎందుకంటే రామ్‌చరణ్ మైనపు విగ్రహంలో ఆయన పెంపుడు శునకం రైమ్ కూడా భాగస్వామి కానుంది. ఇలా పెంపుడు జంతువులతో మేడమ్ టుస్సాడ్స్‌లో ఇప్పటివరకు కేవలం క్వీన్ ఎలిజిబెత్-2 మైనపు విగ్రహం మాత్రమే ఉంది. క్వీన్ ఎలిజబెత్-2 తర్వాత ఆ అవకాశం రామ్‌చరణ్‌కే రావడం విశేషం.

## కామన్వెల్త్ క్రీడల నుంచి
# క్రికెట్, హాకీ, రెజ్లింగ్, బ్యాడ్మింటన్ తొలగింపు



**బలగం టీవి, న్యూఢిల్లీ**

గ్లాస్గో వేదికగా 2026లో జరగనున్న కామన్వెల్త్ క్రీడల నుంచి హాకీ, రెజ్లింగ్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్రికెట్, స్క్వాష్, షూటింగ్, నెట్ బాల్, రోడ్ రేసింగ్‌ను తొలగించనున్నారు. తాజాగా ఈ విషయాన్ని కామన్వెల్త్ క్రీడల సమాఖ్య ప్రకటన చేసింది. దీంతో భారత్‌కు భారీ షాక్ తగిలనట్టయింది. 2022లో బర్మింగ్‌హామ్ వేదికగా 19 ఈవెంట్‌లను నిర్వహించారు. అయితే, ఈ సారి మాత్రం ఖర్చులను తగ్గించుకోవడానికి 10 ఈవెంట్‌లను మాత్రమే నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. నాలుగేళ్లకు ఓ సారి జరిగే ఈ కామన్వెల్త్ క్రీడలు 2026లో స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరగనున్నాయి.

కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో 'స్పోర్టింగ్ ప్రోగ్రామ్‌లో అథ్లెటిక్స్, పారా అథ్లెటిక్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్), స్విమ్మింగ్, పారా స్విమ్మింగ్, ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్, ట్రాక్ సైక్లింగ్, పారా ట్రాక్ సైక్లింగ్, నెట్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్, పారా పవర్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, బౌల్స్, పారా బౌల్స్, 3X3 బాస్కెట్‌బాల్, 3X3 వీల్ చైర్ బాస్కెట్‌బాల్ గేమ్స్ ను చేర్చినట్టు పేర్కొంది. కేవలం 10 క్రీడలతోనే ఈ గేమ్స్ నిర్వహిస్తారని తెలిపింది.

అలాగే, "ఈ గేమ్స్ నాలుగు వేదికలలో నిర్వహించబడతాయి - స్కాట్స్‌టౌన్ స్టేడియం, టోల్‌క్రాస్ ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ సెంటర్, ఎమిరేట్స్ అరేనా, స్కాటిష్ కాంపిటీషన్ కాంప్లెక్స్. ఆటగాళ్లు, వారి సహాయక సిబ్బందికి హోటల్‌లో వసతి కల్పిస్తారు" అని కూడా కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ పేర్కొంది.

ఇదిలా ఉండగా, తాజాగా కామన్వెల్త్ నిర్వాహకులు తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌కు ఒకరకంగా ఇబ్బంది కరమే అని క్రీడానిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే రెజ్లింగ్, బ్యాడ్మింటన్, హాకీ, క్రికెట్, షూటింగ్ లాంటి క్రీడల్లో భారత్‌కు పతక అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ఇప్పుడీ క్రీడాంశాలను తొలగించడం వల్ల మెడల్స్ సంఖ్య గణనీయంగా తగ్గే ఛాన్స్ ఉంది. ఇక 2022 కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం 61 పతకాలు సాధించి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. అందులో 22 గోల్డ్, 16 సిల్వర్, 23 బ్రాంజ్ మెడల్స్ ఉండటం విశేషం. రెజ్లింగ్‌లో అత్యధికంగా 12 పతకాలు సాధించగా, వెయిట్ లిఫ్టింగ్‌లో 10 మెడల్స్ వచ్చాయి.

# సింహాసనం ఎదురుచూస్తోంది..




**బలగం టీవి, హైదరాబాద్**

ప్యాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న కామెడీ యాక్షన్ 'ది రాజా సాబ్' . ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండగా మారుతి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే సినిమా నుంచి రిలీజ్ అయిన ప్రభాస్ లుక్స్, గ్లిప్స్ కు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. తాజాగా నేడు ప్రభాస్ 45వ పుట్టినరోజు జరుపుకుంటున్న నేపథ్యంలో 'ది రాజా సాబ్' మేకర్స్ ప్రభాస్ కొత్త లుక్‌ను రిలీజ్ చేశారు. అలాగే మారుతి టీం అదిరిపోయే కానుకను రెడీ చేసింది. సింహాసనం ఖాళీగా లేదు. సింహాసనం తనకు చెందిన వ్యక్తి కోసం ఎదురుచూస్తోంది.. అంటూ రాజసం ఉట్టిపడేలా తలకిందులుగా ఉన్న సింహాసనం ఫొటోను షేర్ చేశారు మేకర్స్. ఇప్పుడీ పోస్టర్ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా రాజాసాబ్ స్నీక్ పీక్ వరల్డ్ గ్లింప్స్ వీడియోను లాంచ్ చేయనున్నట్టు నిర్మాత ఎస్‌కేఎన్ హింట్ ఇచ్చేశారని తెలిసిందే.

# మలేషియాపై భారత్ విజయం



**బలగం టీవి, న్యూఢిల్లీ**

ప్రతిష్ఠాత్మక సుల్తాన్ ఆఫ్ జోహార్ కప్‌లో భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు వరుస విజయాలతో దూసుకెళ్లుతోంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో మలేషియాను చిత్తుగా ఓడించి హ్యాట్రిక్ విజయం నమోదు చేసింది. భారత జట్టు ధాటికి మలేషియా 4-2తో ఓటమి పాలైంది. దాంతో, టీమిండియా 9 పాయింట్లతో గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది.

మలేషియా వేదికగా జరుగుతున్నసుల్తాన్ ఆఫ్ జోహార్ కప్‌లో భారత్ మలేషియా మధ్య మ్యాచ్ జరిగింది. మ్యాచ్ మొదలైన 8వ నిమిషంలోనే మలేషియా గోల్ చేసింది. డానిష్ ఐమన్ 8వ నిమిషంలో గోల్ చేయగా.. హ్యారిస్ ఒస్మాన్ 9వ నిమిషంలో గోల్ కొట్టాడు. తొలి అర్థ భాగంలో మలేషియా రెండు గోల్స్‌తో ఆధిక్యంలో ఉన్నవేళ .. 11వ నిమిషంలో శారద తివారీ గోల్‌తో పోటీలోకి వచ్చిన భారత్ ఇక వెనుదిరిగి చూడలేదు. అర్షదీప్ సింగ్ (13), తలెమ్ ప్రియబర్త(39)లు ప్రత్యర్థి డిఫెండర్లను బోల్తా కొట్టిస్తూ భారత్ ఆధిక్యాన్ని 3-2కు పెంచారు. అనంతరం రోహిత్ 40వ నిమిషంతో బంతిని మలేషియా గోల్‌పోస్ట్‌లోకి పంపాడు.